సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



ఘనంగా సీటీఎం తిరునాల

మదనపల్లె మండలం సీటీఎం నలవీర గంగా భవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం తిరునాల ఘనంగా జరిగింది. -8లో..



పటిష్టంగా ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి

ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 142 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదే



పాఠశాలలో విచారణ జరుపుతున్న డీఈఓ రాఘవరెడ్డి

చిట్వేలి: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదులు రావడంతో డిప్యూటీ ఈఓ వరలక్ష్మీతో కలిసి ఆయన బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థి వికాసం ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని, వారు నేర్పే క్రమశిక్షణ ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఎంపీపీ చంద్ర, ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉమా మహేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం రెడ్డి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో రోడ్డు ప్రమా దాల నివారణే ధ్యేయంగా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దిశా నిర్దేశం చేశారు. జిల్లా పరిధిలో వారం రోజులుగా పోలీసులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌పై జిల్లా ఎస్పీ బుధవారం ఆయన కార్యాలయం నుంచి సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధారణ, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

- ద్విచక్రవాహనంపై హెల్మెట్‌ను, నాలుగు చక్రాల వాహనాలలో సీటుబెల్ట్ విస్మరిస్తే అనుకోని ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. రహదారి భద్రతా ప్రమా ణాలు పాటిస్తూ విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు.
- స్పెషల్ డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 1860 ఈ ఛలాన్లు వేశారు. అందులో హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై 1696 ఈఛలాన్లు, సీటు బెల్ట్ ధరించకుండా వాహనం నడుపుతున్న వారిపై 164 ఈ ఛలాన్లు నమోదయ్యాయని వివరించారు. మొత్తం రూ.1,86,000 జరిమానా విధించడంతో పాటు ఆరు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేశారని తెలియపరిచారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందులను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరరావు

రామాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఉమామహేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట కడప విజిలెన్స్ అధికారి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, అగ్రికల్చర్ అధికారి బాలగంగాధర్‌రెడ్డి, జీసి గంగిరెడ్డి, రమేష్ ఉన్నారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను, ఆసుపత్రిలోని సౌకర్యాలు, సేవలను, సిబ్బంది వివరాలు, మందుల నిల్వ, వినియోగం, సిబ్బంది పనితీరుపై వివరాలు సేకరించారు. తనిఖీ వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం కడప, అన్నమయ్య జిల్లాల విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఏఓలు బాలగంగాధర్ రెడ్డి, రమేష్, గంగిరెడ్డిలు తనిఖీలు చేసి ఓపీ రిజిస్టర్లు, వార్డు, ఎక్సరే గదులు, ఆపరేషన్, ల్యాబ్ టెక్నీషియన్, కాన్పులు, ఈసీ, చిన్నపిల్లల గదులతోపాటు టెక్నికల్ వార్డులను వారు పరిశీలించారు.

నేటి నుంచి జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళిశాఖ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కడప నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభిస్తున్నామని చేనేత జౌళిశాఖ అధికారి భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్నామన్నారు. అలాగే ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ జ్యోతి ప్రజ్వలన గావిస్తారన్నారు.

ఉవ్వెత్తున వెలుగులు

- ఆర్టీపీపీలో పూర్తి స్థాయి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి
- 1650 మెగావాట్లకు గాను 1450 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- ఏడాదికిపైగా ఈస్థాయిలో చోటుచేసుకోని ఉత్పత్తి
- బొగ్గు కొరతకు చెక్.. ముందస్తు జాగ్రత్తలతో పెరిగిన నిల్వలు
- 42 వేల మెట్రిక్ టన్నులకు చేరుకున్న బొగ్గు నిల్వ



సాక్షి ప్రతినిధి, కడప: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) వెలుగులు నింపుతోంది. ప్రధానంగా రాయలసీమ ప్రాంత ప్రజలకు లోఓల్టేజీ సమస్యలను కట్టడి చేస్తోంది. విద్యుత్ కోతలకు ఆస్కారం లేకుండా ఆరు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. 1650 మెగావాట్ల సామర్థ్యానికి గాను 1450 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఏడాదికి పైగా ఇంతటి సామర్థ్యంలో విద్యుత్ ఉత్పత్తి తీయలేదని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి లభిస్తోంది. ఒక్కో యూనిట్ 210 మెగావాట్ల సామర్థ్యంతో 5 యూనిట్లు ఆర్టీపీపీలో నెలకొల్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకటి, రెండవ యూనిట్లు నోచుకోగా, 3, 4, 5, 6 యూనిట్లు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూపుదిద్దుకున్నాయి. 6వ యూనిట్ 600 మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పడంతో మొత్తంగా 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడింది. కాగా 2014–19 టీడీపీ సర్కార్ హయాంలో తీవ్రమైన బొగ్గు కొరత ఏర్పడింది. ఆశించిన మేరకు విద్యుత్ ఉత్పాదన నోచుకోలేదు. ముందుచూపు లేకపోవడంతో టీడీపీ హయాంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నమైందని కార్మికులు వివరిస్తున్నారు. కాగా ఏడాదిగా ఈ స్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయడం ప్రస్తుత ఉత్పత్తే అరుదు అని యంత్రాంగం వివరిస్తోంది.

▸▸ దినదినాభివృద్ధి....

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు దినదినాభివృద్ధి వేగంగా చోటుచేసుకుంది. ఎన్టీ రామారావు హయాంలో అంకురార్పణ చేసి, తొలి యూనిట్‌ను ప్రారంభించి, రెండవ యూనిట్ పనులు కొనసాగించారు. ఆ పనులను చంద్రబాబు సర్కార్ పూర్తి చేయించింది. దివంగత సీఎం వైఎస్ హయాంలో అత్యంత వేగంగా ఒకదాని తర్వాత మరొకటి అన్నట్లుగా 3, 4, 5, 6 యూనిట్లు వేగంగా నిర్మించారు. వెరశి ఆర్టీపీపీకి 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తీసుకవచ్చారు. తద్వారా లో ఓల్టేజీ సమస్యకు చెక్ పడింది.

▸▸ 42 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు..

ఆర్టీపీపీలో అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలంటే సుమారు రోజుకు 21 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కానున్నట్లు యంత్రాంగం వివరిస్తోంది. టీడీపీ సర్కార్‌లో ఐదేళ్ల కాలంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నం కావడంతో ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ముందు చూపుతో వ్యవహరించింది. ఒకేసారి 6లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీకి చేరాయి. దాంతో బొగ్గు కొరత అనే సమస్యే లేకుండా పోయిందని కార్మికవర్గాలు చెబుతున్నారు. ప్రస్తుతం 42వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీలో సిద్ధంగా ఉన్నాయి.

డిమాండ్ ప్రకారమే విద్యుత్ ఉత్పత్తి

ఏపీ జెన్‌కో యాజమాన్యం సూచన మేరకు డిమాండ్‌ను బట్టి ఆర్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నాం. ప్రస్తుతం 6 యూనిట్ల ద్వారా ఉత్పత్తి కొనసాగుతోంది. బొగ్గు కొరత అనే సమస్యే తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఒకేసారి 6 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు చేరింది. ప్రస్తుతం ప్రతిరోజు 6నుంచి 7వ్యాగన్లు బొగు సరఫరా అవుతోంది. జెన్‌కో ఆదేశాల మేరకు 1650 మెగావాట్లుకు గాను 1450 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. అన్ని యూనిట్ల ద్వారా ఏకధాటిగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నాం. – మురళీకృష్ణా, సీఈ, ఆర్టీపీపీ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు
వైభవంగా చేపడతాం

- ఏప్రిల్ 5న కోదండ రామస్వామి కల్యాణం
- ముఖ్యమంత్రిచే పట్టు వస్త్రాల సమర్పణ
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 30వ తేది నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో వీరబ్రహ్మం చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన టీటీడీలోని వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష జరిపారు. దానికి ముందు రాజంపేటలోని 108 అడుగుల తాళ్ళపాక అన్నమాచార్య విగ్రహం ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం జేఈవో విలేకర్లతో మాట్లాడుతూ మార్చి 30వ తేది సాయంత్రం అంకురార్పణతో శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేది శ్రీ కోదండ రాముని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు, స్వామి వారి కల్యాణానికి హాజరు అయ్యే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నెల రోజుల ముందు నుంచే టీటీడీ ఈ పనులను ప్రారంభించిందని ఆయన తెలిపారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులను అనుమతించాల్సిన విధానం, భక్తులకు తాగు నీరు, అన్నప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. గ్యాలరీలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ సారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికి స్వామి వారి ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీటీడీ ఈవో ఎ.వి. ధర్మారెడ్డి రెండు వారాల్లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, విద్యుత్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఈఈ సుమతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డీఎఫ్‌వో శ్రీనివాస్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, ప్రచురణల విభాగం ప్రత్యేక అధికారి రామరాజు పాల్గొన్నారు.



కల్యాణ వేదిక ఆవరణలో టీటీడీ అధికారులతో కలిసి పరిశీలన చేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

వ్యాక్సినేషన్ వందశాతం పూర్తి చేయాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ

కేవీపల్లి: మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ వందశాతం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీ పరిధిలోని మిన్నంరెడ్డిగారిపల్లె, జిల్లేళ్లమంద పీహెచ్‌సీ పరిధిలోని నూతనకాల్వలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోవిడ్ వ్యాక్సినేషన్ వివరాలు, హైరిస్కు గర్భవతుల నమోదు, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భవతుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రేష్మ, జిల్లా కార్యాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణ, ఎంపీహెచ్ఈవో శివారెడ్డి, ఎంపీహెచ్ఎస్ గీతాకుమారి, పీహెచ్ఎన్ రమాదేవి, సూపర్‌వైజర్ పురుషోత్తం, సిబ్బంది జలజ, రమణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం

- ఇప్పటికే పలుచోట్ల జాబ్‌మేళాలతో ఉపాధి వైపు అడుగులు
- జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లతో ప్రత్యేక శిక్షణ
- రేపు మదనపల్లెలో వివిధ మల్టీ నేషనల్ కంపెనీలతో జాబ్‌మేళా
- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాష ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏర్పాట్లు



జాబ్‌మేళా జరిగే మదనపల్లె బీటీ కళాశాల

సాక్షి రాయచోటి : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒక పక్క పరిశ్రమలు నెలకొల్పుతూ అందులో యువతకు ఉపాధి కల్పిస్తూనే.. మరోపక్క చదువుకున్న నిరుద్యోగులకు మల్టీ నేషనల్ కంపెనీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. చదువుకున్నప్పటికీ వివిధ రంగాలలో నైపుణ్యం లేక ఇబ్బంది పడుతున్న వారికి ప్రత్యేకంగా స్కిల్ హబ్‌ల ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే ఐదుసార్లు జాబ్‌మేళాలు నిర్వహించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు.

మదనపల్లెలో భారీ జాబ్‌మేళా

మదనపల్లెలోని బీటీ కళాశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రైల్వే కోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె ఇలా అన్ని చోట్లా జాబ్‌మేళాలు నిర్వహించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు మదనపల్లెలో కూడా భారీ ఎత్తున నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు సుమారు 8500 మందికి పైగా నిరుద్యోగులు తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డీఆర్‌డీఏతో పాటు నైపుణాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేకంగా జాబ్‌మేళా నిర్వహిస్తోంది.

జాబ్‌మేళాకు ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవ

మదనపల్లెలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాష ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పలు కంపెనీలతో ఎంపీ, ఎమ్మెల్యేలు చర్చించి కంపెనీల ప్రతినిధులు ఇక్కడికి వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.



బీటీ కళాశాల గ్రౌండ్స్‌లో మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

యువత ఉపాధికి పెద్దపీట



నిరుద్యోగ యువత ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈనెల 10వ తేదీన మదనపల్లె బీటీ కళాశాలలో వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు అన్ని ఏర్పాట్లు చేశాం. నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాం. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – పీఎస్ గిరీషా, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

మెగా జాబ్‌మేళా ఏర్పాట్ల పరిశీలన

మదనపల్లె: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా జరగనున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. బుధవారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజంపేట పార్లమెంటరీ పరిధిలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు మదనపల్లె నియోజకవర్గం నుంచే కాకుండా తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటికి చెందిన నిరుద్యోగులు హాజరై ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. సచివాలయాల్లో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు గురువారం సాయంత్రంలోపు చేసుకోవాలని, దూరప్రాంతాల అభ్యర్థులు నేరుగా జాబ్‌మేళాకు చేరుకోవచ్చన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని న్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు హబీబ్‌ఖాన్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులు, నాయకులు గుండ్లూరు రఫీ, బాలగంగాధర్‌రెడ్డి, రహీం, కౌన్సిలర్ మేస్త్రీ శ్రీనివాసులు, వసీం, భాను, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు షెహజాది



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది

కడప సిటీ : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని, వారి సంక్షేమం కోసం మైనార్టీ జాతీయ కమిషన్ పాటుపడుతోందని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు అనే అంశంపై సయ్యద్ షహజాది సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయరామరాజుతోపాటు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ సాయికాంత్‌వర్మ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌజులాజం, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు హిదాయతుల్లా హాజరయ్యారు.

- ఈ సందర్భంగా షహజాది మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన జాతీయ మైనార్టీ కమిషన్ మైనార్టీల సంక్షేమానికి కేంద్రం, రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాల అమలు తీరును పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మైనార్టీల హక్కులను విస్మరించే వారిపై కమిషన్ చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
- రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో భాగంగా మైనార్టీ వర్గాలకు చెందిన పేదలు ఆర్థికంగా బలపడుతున్నారని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు జాతీయ మైనార్టీ కమిషన్‌కు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కృష్ణ కిశోర్, బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఎం ఎన్ రాణి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీఈఓ దేవరాజు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమాల అమలుపై సమీక్ష

ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఉర్దూ బోధన, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ తదితర అంశాలను సమీక్షించారు. పేదలకు స్వయం ఉపాధి, వేతన ఉపాధి, సాంకేతిక శిక్షణ, గ్రామీణ గృహ నిర్మాణ పథకం, మురికి వాడల్లో నివసించే మైనార్టీ వర్గాల పరిస్థితిని మెరుగు పర్చడం, మత సామ రస్యం, శాంతి నెలకొల్పడం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

- కలెక్టర్ విజయరామరాజు మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

కలెక్టరేట్‌లోని వీసీ హాలులో సమీక్ష అనంతరం సయ్యద్ షహజాది విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి మైనార్టీ వర్గాలకు చెందిన కుల సంఘాల, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. ఉద్యోగ, వృత్తి పరంగా, ఆర్థికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పలు వినతులను స్వీకరించామని తెలిపారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో హజ్ భవన్, పెద్దదర్గా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

కడప రూరల్: మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో వివిధ మైనార్టీ వర్గాల సంఘాల నేతలు, మత పెద్దలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది మాట్లాడారు.

సభ్యురాలికి మైనార్టీ నేతల వినతులు....

ఈ సందర్భంగా మైనార్టీ నేతలు పలు సమస్యల పరిష్కారం కోసం కమిషన్ సభ్యురాలికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కొంత మంది పార్టీల పేరు చెప్పుకొని ప్రసంగించడానికి ప్రయత్నించారు. దీనిపై కమిషన్ సభ్యురాలు అభ్యంతరం చెప్పారు. పార్టీల కతీతంగా ఈ సమావేశం జరుగుతోందన్నారు. కార్పొరేటర్ షఫి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి క్రిష్ణ కిషోర్ మైనార్టీ సంఘాల నేతలు, సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్, నజీర్‌బాష, దస్తగిరి, బాబు మొయినుద్దీన్, పాస్టర్లు పాల్గొన్నారు.

▸▸ పెద్దదర్గాలో ప్రార్థనలు



చాదర్ తీసుకు వస్తున్న సయ్యద్ షహజాది

కడప కల్చరల్: కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బుధవారం జాతీయ అల్పసంఖ్యాక మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది ప్రార్థనలు నిర్వహించారు. నగర పర్యటనకు విచ్చేసిన ఆమె సంబంధిత అధికారులు, సహచరులతో కలిసి దర్గాను దర్శించుకున్నారు. పూల చాదర్‌తో దర్గాకు చేరుకున్న ఆమెకు దర్గా ముజావర్ అమీర్ ఆమెకు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. తొలుత ఆమె దర్గాలోని హజరత్ పీరుల్లా మాలిక్ మజార్‌తోపాటు ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : జాతీయ మెగా లోక్ అదాలత్ కేసుల పరిష్కారంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా పరిధిలోని పోలీసు అధికారులకు అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. ఈ నెల 11న నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌లో కేసులను త్వరితగతిన పరిష్కారం చేసుకునే విధంగా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్సు ద్వారా జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. జిల్లా అంతటా కోర్టులలో జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంపై కేసులలోని ఇరు పక్షాల వారికి అవగాహన కల్పిస్తూ వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వీలైనంత వరకు ఎక్కువగా కేసులను పరిష్కరింపచేయాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో ఇరు పక్షాల సమ్మతితో పరిష్కరించాలన్నారు. కోర్టు ఇచ్చిన నివేదిక, జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల ప్రకారం రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులలో నోటీసులు ఇరుపక్షాల వారికి జారీ చేయాలని సూచించారు.

అడవి పందుల దాడిలో రైతుకు గాయాలు



గాయపడిని ఎర్ర ఆంజనేయులను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని వైకోట గ్రామానికి చెందిన ఎర్ర ఆంజనేయులు అనే రైతుపై అడవి పందులు మంగళవారం దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎర్ర ఆంజనేయులు రోజూ లాగే ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో ఉన్న అడవి పందుల మందను గమనించి అదిలించగా.. రెండు అడవి పందులు ఆయనపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడికి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. బుధవారం సీపీఎం, సీఐటీయూ నాయకులు ఎర్ర ఆంజనేయులను పరామర్శించి వైకోట వ్యవసాయ పంట పొలాలు వద్ద అడవి పందుల బెడద తీవ్రంగా ఉందని, అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీటీఎం తిరునాల



ప్రత్యేక అలంకరణలో నలవీర గంగాభవానీ



జాతరలో భక్తుల సందడి

- పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం నలవీర గంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం తిరునాల ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో సీటీఎం పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారిని కర్పూరనీరాజనాలతో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి– మదనపల్లె రోడ్డు జన సంద్రంగా మారింది. సీటీఎం పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు మొక్కుల కోసం చాందినీబండ్లు, టెంకాయల బండ్లు, అన్నం వాహనాలను మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వందలాది బండ్లు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు గాజులు, పసుపు, కంకుమ, సారె, చీరలను సమర్పించారు. ఆలయం ధ్వజస్తంభం ఎదుట టెంకాయలు కొట్టి నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాలూకా సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ టూ డిపో జాతరకు ప్రత్యేక బస్సులు నడిపారు.

కోలాహలంగా జాతర ప్రాంగణం

జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. దుకాణాల వద్ద కొనుగోలుదారులతో కిటకిటలాడింది. కొలంబస్, జెయింట్‌వీల్‌తోపాటు పలు ఆటలతో సందడిగా మారింది. గురువారం దోపు తిరునాలతో జాతర ముగుస్తుందని కమిటీ నిర్వాహకులు అనంద పార్థసారధి, వీరప్రతాప్, వెలుగు చంద్ర తెలిపారు. గురువారం నుంచి ఎద్దుల పరష జరుగుతందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక బుధవారం తెలిపారు. సీఐ కథనం మేరకు... ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలం సంపతికోటకు చెందిన ఏ.రామక్రిష్ణ(50) మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో పట్టుకున్నారు. నిందితుడి నుంచి 80 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, అతన్ని రిమాండ్‌కు తరలించారు.

మహిళపై దాడి

– ముగ్గురిపై కేసు నమోదు

కలకడ : మహిళపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ అక్కన్నగారికోట గ్రామానికి చెందిన అలివేలమ్మ భూమిలోని చింతచెట్లును అదే గ్రామానికి చెందిన తిరుపతి, ఆయన భార్య సుజాత, కుమారుడు నవీన్ కలిసి నరికేశారు. ఈ విషయంపై వారిని అడిగినందుకు తనను దుర్భాషలాడినట్లు అలివేలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పటిష్టంగా ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి

- అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి
- విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యాధికారులు శ్రద్ధ చూపాలి
- జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా



మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి, చిత్రంలో జేసీ తమీమ్‌అన్సారియా

రాయచోటి : ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతీయ ఆహారభద్రతపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియాతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఈ నెల 6, 7వ తేదీలలో రైల్వేకోడూరు, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె, సంబేపల్లె, గుర్రంకొండ మండలాలలోని చౌకదుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్స్, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు విజిట్ చేసినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పంపిణీ, చౌకదుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి సంబంధించి అక్కడక్కడా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయన్నారు. వీటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. ఇందుకు సంబంధించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పౌరసరఫరాల అధికారులు తగు పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. రక్తహీనతతో బాధపడే వారందరికీ కోడిగుడ్లు, పౌష్టికాహారం అందేటట్లు చూడాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. అన్నమయ్య జిల్లాలోని అంగన్వాడీ సెంటర్లు, చౌకదుకాణాలు, వసతిగృహాలలోని సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 54 వసతి గృహాలు ఉన్నాయన్నారు. ప్రతి వసతిగృహానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే నోడల్ అధికారి ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై వైద్యాధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, చౌకదుకాణాలను తరచూ విజిట్ చేయడం జరుగుతుందని అధికారులందరూ జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కమిషన్ సహాయ సంచాలకులు పి.సురేష్, డీఎస్ఓ రఘురాం, డీఈఓ రాఘవరెడ్డి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి



తీవ్రంగా గాయపడ్డ రెడ్డికిరణ్

మదనపల్లె : పాతకక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మదనపల్లె పట్టణంలో బుధవారం జరిగింది. నిందితుడ్ని స్థానికులు అదుపులోకి తీసుకుని కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్ ఎక్స్‌టెన్షన్ సప్తగిరినగర్‌కు చెందిన రెడ్డికిరణ్ స్థానికంగా సెలూన్ షాపు నిర్వహిస్తున్నారు. అతడి షాపు పక్కనే నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ జాండ్రబైలుకు చెందిన నందకిశోర్(45) పశువుల దాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో రెడ్డికిరణ్ భవన యజమానికి సిఫారసు చేసి నందకిశోర్ దుకాణాన్ని ఖాళీ చేయించాడు. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడి కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం రియల్‌ఎస్టేట్ వ్యాపార నిమిత్తం రెడ్డికిరణ్ పుంగనూరు రోడ్డులోని మారుతి షోరూం వద్దకు వెళ్లాడు. ఇతడిని గమనించిన నందకిశోర్ తనను ఎవరూ గుర్తుపట్టకుండా తలకు హెల్మెట్ పెట్టుకుని రెడ్డికిరణ్‌పై కర్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో రెడ్డికిరణ్ తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సంఘటనను చూసిన స్థానికులు స్పందించి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కట్టేసి కొట్టారు. పోలీసులకు సమాచారమందించారు. బాధితుడు రెడ్డికిరణ్‌ను ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. నిందితుడు నందకిశోర్‌ను తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

హార్సిలీహిల్స్ విద్యార్థుల అపూర్వ కలయిక



హార్సిలీహిల్స్‌లో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై చదువుకొన్న పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. 50 ఏళ్ల తర్వాత చదువుకొన్న చోటనే కలుసుకొని తీపి గురుతులు పంచుకున్నారు. వృద్ధాప్యంలో ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థుల్లో ఒంగోలు, బెంగళూరు, కడప, అనంతపురం, తిరుపతిల్లో నివసిస్తున్న 18 మంది హాజరై సందడి చేశారు. 1965 నుంచి 1972 వరకు హార్సిలీహిల్స్‌పై తిరుమల తిరుపతి దేవస్థానం 4 నుంచి 10వ తరగతి వరకు ఎస్‌వి పబ్లిక్ స్కూల్ నడిపింది. ఈ పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది విద్యార్థులు చదువుకొన్నారు. వీరిలో హాజరైన వారు అటవీశాఖ ప్రాంగణంలో కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని సరదాగా గడిపారు. ఒకరినొకరు విద్యార్థి దశలో జరిగిన సంఘటనలు గుర్తుకు తెచ్చుకొన్నారు. చదువుకొన్న పాఠశాల ప్రాంతం, సంచరించిన ప్రాంతాల్లో తిరుగుతూ విద్యార్థి దశను గుర్తుకు తెచ్చుకొని గడిపారు. ఈ సమావేశానికి హాజరైన నాటి విద్యార్థుల్లో రిటైర్డ్ ఐపీఎస్, మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ, సర్పంచు మధుసూదన్‌రెడ్డి, అనంతపురానికి చెందిన మాజీ మంత్రి కుటుంబానికి చెందిన సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని, రోప్ వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కలకడ మండలం ఎనుగొండపాళెం గ్రామానికి చెందిన యువకుడు చందు (17) మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలోని సీటీఎం గంగజాతరకు ద్విచక్రవాహనంలో వచ్చాడు. తిరుగుప్రయాణంలో వాల్మీకిపురం వైపు వెళుతుండగా కాశీరావుపేట సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్లు దిగుతూ..: మండలంలోని సీటీఎం పంచాయతీ రేగడ గ్రామానికి చెందిన గంగులప్ప పట్టణంలోని ఓ బార్‌లో పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో మెట్లు దిగుతూ రేకుపై పడ్డాడు. దీంతో చేయి తెగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కలకడ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఝరిగడ్డ గ్రామ సమీపంలో బాహుదా నదిలోని ఇసుకను కెవిపల్లె మండలం జిల్లేలమంద గ్రామానికి చెందిన రెడ్డినాయక్ కుమారుడు బాలాజీనాయక్, రామదాసునాయక్ కుమారుడు మంగునాయక్ తరలిస్తున్నారు. ఎస్ఐకు అందిన సమాచారం మేరకు తన సిబ్బంది శ్రీనివాసులు, రాజేంద్ర, మహబూబ్‌బాషా, నాగిరెడ్డిలతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ట్రాక్టర్ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట కేసులో టీడీపీ నేత అరెస్ట్



అరెస్ట్ అయిన వారిలో టీడీపీ నాయకుడు వెంకటరమణ (మాస్క్ ధరించిన వ్యక్తి)

కేవీపల్లె : పేకాట కేసులో టీడీపీ నేతను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. బుధవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లె వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా పది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.22,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడ్డ వారిలో టీడీపీ మండల నాయకుడు, మాజీ ఎంపీపీ భర్త అయిన వెంకటరమణనాయుడు ఉండటం గమనార్హం.

గండికోట మరింత అభివృద్ధి

- అభివృద్ధికి అందరూ సహకరించాలి
- గండికోట వాసుల సమావేశంలో ఆర్డీఓ

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోట భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని, దానిని దృష్టిలో పెట్టుకుని గ్రామస్తులందరూ సహకరించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పర్యాటకుల కోసం గండికోట గ్రామస్తులు ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ టెంట్‌లు వేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వ్యవసాయం కోసం ఇచ్చిన అసైన్డు భూముల్లో ఇష్టారాజ్యంగా లాడ్జిలను ఏర్పాటు చేసి అందులో అసాంఘిక కార్యాకలాపాలు చేయించడం సరైంది కాదన్నారు. గండికోట పూర్తిగా రెవెన్యూ, పర్యాటక, పోలీసు అధికారుల పరిధిలో నియంత్రించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలను తయారు చేసి కమిటీ నిర్ణయించిన ధరలు మాత్రమే పర్యాటకుల వద్ద వసూలు చేయాలన్నారు. రూములు బాడుగలకు ఇచ్చి చెత్త చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడం ద్వారా వాటిని శుభ్రం చేయడం కష్టం అవుతుందన్నారు. రోడ్లు, కాలువలు లేవని, టెంట్ యజమానులు తమ వ్యాపారాలు జరగడం కోసం మందు సప్లయి చేసి వాటిని అక్కడే పడేసిపోతున్నారు. వాటిని ఎవరు శుభ్రం చేయాలని ప్రశ్నించారు. కాబట్టి ప్రతి ఒక్కరూ గండికోట పంచాయతీ అధికారులకు తమవంతు బాధ్యతగా సహకరించాలన్నారు. త్వరలో గండికోట టూరిజం హబ్‌గా మారబోతుందన్నారు. రోప్‌వే పనులు సైతం త్వరలో ప్రారంభం అవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ తిరుపతయ్య, గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, రెవెన్యూ, టెంట్, లాడ్జిల యజమానులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో విచారణ ప్రారంభం

- 2021-22 ఏడాది పాలనపైనే విచారణ
- మరోవైపు నిధులపై ఆడిట్ చేస్తున్న ఆడిటర్లు



బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఏమి జరిగింది అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మంగళవారం మున్సిపల్‌శాఖ అనంతపురం ఆర్‌డీడీ పీవీవీఎస్ మూర్తి, ఆడిటర్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరుగుతుందని, దాని లెక్క తేలాక వాటిని స్వాహా చేసిన వారి నుంచి తిరిగి వసూలు చేస్తామని ఆర్‌డీడీ ప్రకటించడం చర్చనీయాంశమైంది. దీంతో నిధుల దుర్వినియోగం, అక్రమాలు జరిగాయన్న చర్చ సాగుతోంది. మరోవైపు కార్యాలయంలో గత ఆర్థిక సంవత్సరంలో అధికారులు తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన అనుమతులు, నిధుల వసూళ్లు, వినియోగంపై రికార్డుల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ చట్టప్రకారం బడ్జెట్‌ను తయారు చేశాక మున్సిపల్ శాఖ, కలెక్టర్ ఆమోదం తెలుపుతారు. తర్వాత బడ్జెట్ మేరకు పాలన, నిధుల వినియోగం జరుగుతుంది. దీంతో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ ఆదాయ, వ్యయాలపై ప్రతి పైసాకు రికార్డులు నిర్వహించాలి. నగర పంచాయతీకి సంబంధించిన బ్యాంకు ఖాతాకు నిధులను జమ చేసి, ఏదైనా చెల్లింపులకు అనుమతి పొందాక నిబంధనల ప్రకారం చెల్లింపులు జరగాలని ఆడిటర్లు స్పష్టం చేస్తున్నారు. కాగా ఇంటి పన్నులకు రశీదులు ఇచ్చి వసూలు చేసిన నగదును జమ చేయలేదని ఫిర్యాదులు అందాయని ప్రకటించి ఆ రశీదును ఆర్‌డీడీ మీడియాకు చూపించారు. ఇంటి పన్నులకు సంబంధించి వసూలైన నిధులు నగర పంచాయతీకి జమ కాలేదన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌డీడీ ఆదేశాలతో 2021–22 ఆర్థిక సంవత్సర ఆదాయ, వ్యయాల లెక్కలను తేల్చే పనిలో పడ్డారు. ఎంత నిధులు వసూలయ్యాయి, ఎంత సొమ్ము ఖాతాలకు జమ చేశారు, ఆ ఖాతాల నుంచి ఎంత సొమ్ము ఎవరు డ్రా చేశారు, పనులు చేయకనే బిల్లులు డ్రా చేశారా, ఎవరి పేరుతో చెక్కులు జారీ చేశారు. నగదు ఏమైనా చెల్లించారా అన్న వివరాలను పరిశీలిస్తున్నారు. నిధుల వినియోగానికి సంబంధించి ఉన్నతాధికారులు లేదా ప్రత్యేక అధికారి ఆమోదం ఉందా లేదా, దీనిపై తీర్మానాలు చేశారా లేదా అని రికార్డులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆడిటర్లు కూడా గత ఆర్థిక సంవత్సర లెక్కలను పరిశీలించే పనిలో పడ్డారు. ఇప్పటికే పరిశీలన ప్రారంభించిన ఆడిటర్లు మంగళవారం ఆర్‌డీడీతో కలిసి పలు విషయాలపై చర్చించినట్టు తెలిసింది. ప్రాథమికంగా అక్రమాలు జరిగినట్టు నిర్ధారించాకే ఆర్‌డీడీ సమగ్ర విచారణ చేపట్టారని తెలుస్తోంది. నివేదిక అందాక మరింత సమగ్రంగా విచారణ జరిపేందుకు అధికారులతో కమిటీని నియమించే అవకాశం ఉందని సమాచారం.